క్లుప్తంగా

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి,షిప్‌యార్డ్ యాదవ సంఘ ప్రతినిధులు

మల్కాపురం: హిందుస్థాన్ షిప్‌యార్డ్ యాదవ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ముద్రించిన 2023 సంవత్సర క్యాలెంటర్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం ఆవిష్కరించారు. మేయర్ నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యతతో ముందుకు సాగుతూ సంస్థ అభివృద్ధితో పాటు కార్మిక సంక్షేమానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకుడు మాడిసి రమణమూర్తియాదవ్, షిప్‌యార్డ్ యాదవ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఉరుకూటి మురళి,జోగ రాజు,చిన్నాజీ,మొల్లి అప్పలరాజు,వంశీ,సింహచలం, కోన నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కోస్టుగార్డు సిబ్బంది వాక్‌థాన్


వాక్‌థాన్‌లో పాల్గొన్న కోస్టుగార్డు అధికారులు,సిబ్బంది

మల్కాపురం: ఫిట్ ఇండియా–యంగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కోస్టుగార్డు హెడ్‌క్వార్టర్ (మల్కాపురం) ఆధ్వర్యంలో సోమవారం వాక్‌థాన్ చేపట్టారు.మల్కాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో 250 మంది తీర గస్తీ దళ సభ్యులతో పాటు సాధారణ పౌరులు పాల్గొన్నారు. ఐక్యత,ఫిట్ ఇండియా ప్రాధాన్యత, సురక్షితమైన సంస్కృతిపై తీర ప్రాంత భద్రతపై ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు.

త్రైత సిద్ధాంత గ్రంథ ప్రదర్శన


ఎన్‌ఏడీ జంక్షన్‌లో త్రైత సిద్ధాంత గ్రంథాన్ని ప్రదర్శిస్తున్న సమితి సభ్యులు

గోపాలపట్నం: త్రైత సిద్ధాంత గ్రంథ ప్రదర్శనలు ఎన్‌ఏడీ గోపాలపట్నం, బాజీ జంక్షన్ ప్రాంతాల్లో నిర్వహించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఈ ప్రదర్శనలు చేపట్టారు. హిందూ ధర్మ ప్రచారం చేస్తూ గ్రంథాల అమ్మకాలు సాగించారు. హిందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి విశాఖ కమిటీ అధ్యక్షుడు సూర్యనారాయణ ప్రజలకు త్రైత సిద్ధాంత విశిష్టతను, భగవద్గీత సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో నర్సింగరావు, ఆదినారాయణ, వైవీ రమణ, మంగక్క, రేవతి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొర్లె చందు, యూనియన్ నాయకులు

కంచరపాలెం: నేషనల్ పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి గొర్లె చందు సోమవారం పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ కె.రామ్మోహన్‌రావును పోర్ట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.గురుప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటరావు, అప్పారావు, అప్పలనాయుడు, శాంతి, బి.కె. సత్యనారాయణ, ఎస్కేరాజు, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

శేష శైలవాసా.. శ్రీవేంకటేశ

- పుష్పాలంకృతుడై దర్శనమిచ్చిన వేంకటేశ్వర స్వామి
- ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు


వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులను ఆశీర్వదిస్తున్న హరిదాసు


కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం లో స్వామి

గోపాలపట్నం: శేష తల్పంపై కొలువు దీరి భక్తులను కటాక్షించాడు మహా విష్ణువు... వైకుంఠ ఏకాదశి సందర్భంగా గోపాలపట్నం ఎన్‌ఏడీ ప్రాంతాల్లోని పలు వైష్ణవ ఆలయాల్లో స్వామి ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. విమాన్ నగర్ వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి ఉత్తర ద్వారంలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన కోలాటం అలరించింది. ఆలయ ప్రాంగణంలో హరి దాసుడు భక్తులకు ఆశీర్వచనాలు పలికాడు.

- కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి విశేషాలంకరణలో ఆకట్టుకున్నాడు. ఉత్తర ద్వారంలో ఉత్సవ మూర్తులను దర్శించి భక్తులు పులకించిపోయారు.
- కొత్తపాలెంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వా దర్శనాలు ఘనంగా జరిగాయి. స్వామి విభిన్న పుష్పాలతో అలంకరించారు. దర్శనాలకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.


వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు..
మల్కాపురం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఆలయాల్లో అర్చకులు సోమ వారం ప్రత్యేక పూజలు చేశారు. ఐవోసీ సమీపంలోని చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వారం గుండా భక్తులకు స్వామి దర్శన ప్రాప్తి కలిగించారు.అలాగే మల్కాపురం గొల్లవీధి వద్ద గల శ్రీకృష్ణుడి ఆలయంలో, ప్రకాష్‌నగర్ వద్ద గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో,జనతా కాలనీ వద్ద గల కల్యాణ వెంకటేశ్వస్వామి ఆలయంతోపాటు శ్రీ హరిపురంలోని హరిహర క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు.


కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు


జనతాకాలనీ ఆలయంలో ఉత్తర ద్వారంలో వేంకటేశ్వరస్వామి

అవ్వాతాతల పెద్దకొడుకు సీఎం జగన్

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్


లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు


కొత్త పింఛన్లు అందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్


గొల్లవీధిలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం: వృద్ధాప్యంతో ఇంటికే పరిమితమైన అవ్వాతాతలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకలను 52వ వార్డు శాంతినగర్ సచివాలయంలో లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 52వ వార్డు పరిధిలో కొత్తపింఛన్లు 25 మంజూరయ్యాయని తెలిపారు. ఈ ఏడాది నుంచి పింఛన్ రూ. 2750 అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల వాగ్దానాలు అమలు చేసిన తొలి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో సుధాకర్, సచివాలయ కార్యదర్శులు నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు బంగారి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

61వ వార్డులో..
మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులోని పలు ప్రాంతాల్లో లబ్ధిదారులకు నూతన పింఛన్లను సోమ వారం ఆయా ప్రాంతాల వార్డు వలంటీర్లు, సచివాలయాల కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గొల్లవీధిలో పార్టీ సీనియర్ నాయకుడు బూస అప్పలరెడ్డి వార్డు వలంటీర్‌తో కలిసి నూతన పింఛన్లు అందించారు.అలాగే పల్లివీధి,గాంధీజీవీధి,ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.

62వ వార్డులో..
సింధియా: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్ నగదుతో పాటు కొత్తగా అర్హత సాధించిన పలువురు లబ్ధిదారులకు 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పింఛన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హత గల ప్రతి ఒక్కరికి పింఛన్ అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రజల మద్దతు ఎల్లప్పుడూ పార్టీపై ఉండాలని, రానున్న ఎన్నికల్లో పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వార్డు కన్వీనర్లు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం

- ఎస్టీబీఎల్‌లో వైభవంగా నిర్వహణ
- అలరించిన 'శ్రీవారి స్వరార్చన'


కల్యాణ మహోత్సవంలో మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: శ్రీనివాసుని కల్యాణం కనులపండువగా జరిగింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ సినీవరల్డ్ తిరుమల బాలాజీ మందిరం వద్ద సోమవారం సాయంత్రం వైభవంగా జరిపించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వేకువజాము నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. తెల్లవారు జామున 4.30 గంటల నుంచి సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు చేసి, భక్తులను దర్శనాలకు అనుమతించారు. గీతా పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు భూదేవి, శ్రీదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ విగ్రహాలను కోలాటం, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా కల్యాణమండపానికి చేర్చారు. వేదమంత్రోచ్చరణల నడుమ శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి కల్యాణాన్ని వీక్షించేందుకు మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు సతీసమేతంగా విచ్చేశారు. ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత బాలాజీ వీరభద్రరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ వైస్ చైర్మన్ జి.వి.కృష్ణయ్య, ప్రతినిధులు జి.గంగా మహేష్, సోమేష్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గోపికాపూర్ణిమ గీతాలు
శ్రీవారి స్వరార్చన పేరిట ప్రముఖ సినీ గాయని గోపికా పూర్ణిమ బృందం ఆలపించిన భక్తి గీతాలు శ్రోతలను అలరించాయి. శ్రీనివాసుని కల్యాణ సమయంలో అన్నమాచార్య కృతులతో పాటు పలు గీతాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలో నూతన తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను సోమవారం వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యను జీవీఎంసీ మేయర్ గొలగాని వెంకటహరికుమారి దృష్టికి తీసుకువెళ్లగా ఆమె స్పందించి నిధులు మంజూరు చేయించారన్నారు. 500 మీటర్ల మేర కొత్త పైప్‌లైన్లు వేయడానికి 12.60 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డ్‌కాలనీలోని శివాలయంలో సోమవారం ఏకాదశి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శనానికి వేకువజాము నుంచిభక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రైవేటీకరణతో కార్మికుల హక్కులకు గండి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉక్కు నిర్వాసితుల హక్కులకు గండి కొడుతూ పరిశ్రమను ప్రైవేట్ పరం చేసేందుకు పావులు కదుపుతున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 690వ రోజు సోమవారం ఆగ్రోఫారెస్ట్, సేఫ్టీ, ఎస్.ఎస్.డి, ఎఫ్.ఎం.డి విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.రామకృష్ణ, గుమ్మడి నరేంద్ర తదితరులు మాట్లాడారు. 30 ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజా ఉద్యమంగా మలచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్ సన్యాసిరావు, డిపార్ట్‌మెంట్ నాయకులు సత్యనారాయణ, ఎం.గోవింద్, రాజు, సాంబశివరావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు


కలియుగ వేంకటేశ్వరుడి సన్నిధిలో అర్చకులు, భక్తులు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు పోటెత్తి వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి జగన్నాథశర్మ, శంకరశర్మ నేతృత్వంలో విశేష పూజలు చేశారు. వేకువజాము 4 గంటలకు గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు దంపతులు కలశ ప్రతిష్ట, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామ సంఘం సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డ్వాక్రా బజార్‌లో రికార్డు స్థాయి విక్రయాలు

- ఒక్కరోజులోనే రూ.52 లక్షల కొనుగోళ్లు



నృత్య ప్రదర్శనలో కళాకారులు

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన అఖిలభారత డ్వాక్రా బజార్ సరస్ 2022లో రికార్డు స్థాయిలో విక్రయాలు జరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజులో రూ.52,31,044 విలువచేసే కొనుగోళ్లు జరిగాయి. దీంతో గత ఆరు రోజుల్లో జరిగిన నమ్మకాలు రూ 1,55,40,451కి చేరుకున్నాయి. ఆదివారం సెలవు కావడంతో నగరం నలుమూలల నుంచిపెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వస్తువులు కొనుగోలు చేశారు. ఈ నెల 7వ తేదీ వరకు డ్వాక్రా బజార్ కొనసాగుతుంది.


అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
ఏడో రోజు కార్యక్రమాలలో భాగంగా స్నేహాంజలి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. మురిపాల గోపాల...అంటూ చిన్నారుల స్వాగత గీతంలో ప్రారంభమైన కార్యక్రమాలు వేయినామాలు....ముద్దుగారే ....,బ్రహ్మమొక్కటే తదితర శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. మేదిని, హారికల లిల్లీపుట్ నృత్యం కడుపుబ్బ నవ్వుస్తూ అందరి మనసులను హత్తుకుంది. సంక్రాంతి సంబరాలు, థింసా నృత్యం మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచాయి. పెద్దసంఖ్యలో నగరవాసులు హాజరై కార్యక్రమాలను తిలకించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

పరవాడ: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత లభిస్తుందని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు కె.అప్పలనాయుడు, కె.శ్రీరామ్మూర్తి అన్నారు. సోమవారం వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ స్వామి వారి పల్లకీని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, ముత్యాలనాయుడు, నారాయణరావు, కన్నంనాయుడు, నరసింహమూర్తి, ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు, అధిక సంఖ్యలో భక్తులు, మాతృమూర్తులు పాల్గొన్నారు

నవరస భరితం.. నృత్యాభినయం

మద్దిలపాలెం: నవరసాల సమ్మేళనంతో కూచిపూడి నృత్యరూపకం అందరినీ అబ్బురపరిచింది. దశావతారాలను ఒకే నాట్యంతో పాటు చక్కని హావభావాలను పలికించి ప్రేక్షకులను మైమరపించారు. పంచమ వేద నృత్యార్చనతోపాటు, అర్థ నారీశ్వరాంతర్యంను ఎంతో చక్కగా అభినయం చేసి అందరి హృదయాలను రంజింపజేశారు. శివ పంచాక్షారిని, ఆనందతాండవమును నృత్యాతాండవంతో ఉర్రూతలూగించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సోమవారం అంబికేశ్వరి కూచిపూడి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ 45వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వందేళ్లుగా తమ అకాడమీ నృత్యకారులను తయారు చేస్తోందని అకాడమీ అధ్యక్షుడు, నాట్య గురువు విజయ భరణిశంకర్ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు తదితరులు కళాకారులను సత్కరించారు.


నాట్యకళాకారుడి నృత్యాభినయం

ముగిసిన శ్రీరాముని కథా నిర్వచనం

భారీగా తరలివచ్చిన నార్త్ ఇండియన్లు


పూజల్లో పాల్గొన్న భక్తులు


శ్రీరాముడు,సీత,హనుమాన్ వేషధారణల్లో ఉన్న వారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్‌లోని జీవీఎంసీ మైదానం(సరస్వతీ పార్కు)లో స్థానిక పూర్వాంచల్ కీర్తన మండలి ఆధ్వర్యంలో గత నెల 24 నుంచి నిర్వహించిన శ్రీరాముని కథ నిర్వచనం కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఆఖరి రోజు కార్యక్రమంలో పండితుడు, శ్రీరాముని కథ వివరించే ప్రవచనకర్త నీరజ నందశాస్త్రి పాల్గొని శ్రీరాముడి పుట్టుక, ఆయన పాలనలో ప్రజలకు జరిగిన మేలు,తండ్రికి ఇచ్చిన మాట కోసం ఆయన పడిన కష్టాలు, శ్రీరాముడు,లక్ష్మణస్వామి మిగిలిన అన్నదమ్ముల ఐక్యతను వివరించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు శ్రీరాముడు,సీతాదేవి,లక్ష్మణుడు,నకుల సహదేవుడు,హనుమంతుడు వేషధారణల్లో వేదికపై చక్కటి ప్రదర్శన చేశారు. ఎమ్మెల్యే పి.గణబాబు దంపతులు జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని శ్రీరాముడు,సీతాదేవిలను దర్శించుకున్నారు. జగతికి శ్రీరాముడు ఇచ్చిన సందేశంపై పండితులు చక్కటి ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు భానుప్రకాష్,చతుర్వేది, ఆర్కే సింగ్,ఎం.పి.సింగ్,కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పూజల్లో నార్త్ ఇండియన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ జనగణన చేపట్టాలని వినతి

అల్లిపురం: బీసీ జన గణన జరిగేలా కేంద్రప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ ఏపీ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం సభ్యులు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావుకు వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఆయన్ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల్లోనూ రిజర్వేషన్ కల్పించడం, బీసీలకు క్రీమిలేయర్ తొలగించడం తదితర అంశాలపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ బీసీ జన గణన అనేది రాష్ట్రాల వారీగా జరిగితే త్వరితగతిన పూర్తవుతుందన్నారు. బీసీ కమిషన్ చైర్మన్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో సంఘం సభ్యులు కోటా రమేష్, కె.రామ్‌కుమార్, కొయ్య రామకృష్ణ, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎల్లారావు,కర్రి రాము తదితరులున్నారు.

ఆశా కార్యకర్తల్లో సేవా భావం అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

ఆరిలోవ: ఆశా కార్యకర్తలు సేవా భావంతో పని చేయాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పైనాపిల్ కాలనీ దరి జిల్లా మహిళా ప్రాంగణంలో ఆశా కార్యకర్తలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజన ప్రాంతాల ఆశా కార్యకర్తలకు ఇక్కడ 10 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌వో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఆశా కార్యకర్తల వైద్య సేవలు ప్రజలకు ఎంతో అవసరమన్నారు. ఇక్కడ శిక్షణ ద్వారా పొందిన అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో మాతా శిశు సంక్షేమ శాఖ వైద్య సేవలపై పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి నెలా 9న నిర్వహిస్తున్న పీఎంఎస్‌ఎంఏ ప్రోగ్రాంలో భాగంగా గర్భిణులకు పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమలాకుమారి, డాక్టర్ బి.ఉమావతి, డీపీహెచ్‌ఎన్‌వో సత్యవతి, హెచ్‌ఈఈవో మణికుమారి, డీసీఎం లక్ష్మి, హెచ్‌ఈ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



అల్లిపురం: గత నెల డిసెంబర్ 31వ తేదీ రాత్రి డీఆర్‌ఎం కార్యాలయం వద్ద కారు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. టూటౌన్ సీఐ తిరుమలరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయి. చామన ఛాయ కలిగి, నలుపు, తెలుపు గెడ్డంతో ఉన్నాడని, ఎరుపు రంగు స్వెటర్, బూడిద రంగు హాఫ్ హ్యాండ్స్ టీ షర్టు, సిమెంట్ రంగు ఫ్యాంటు ధరించాడని సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 04716, 94407 40864 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.